సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



అంతులేని విషాదం

కనురెప్పపాటులో జరిగిన ప్రమాదంలో, క్షణాల వ్యవధిలో ఐదు ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. మృతి చెందిన వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. -8లో



ప్రాణం తీసిన విద్యుత్ కంచె

గోపవరం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన పందిపాటి వెంకటసుబ్బయ్య (17) అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 137 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	420	449
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 211.260 కిలోలు

న్యూస్‌రీల్

ట్రైకార్ చైర్మన్‌గా సురేంద్ర



రాయచోటి టౌన్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) సంస్థ చైర్మన్‌గా గుండా సురేంద్రను నియమించారు. ఈమేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

లోక్ అదాలత్ వాయిదా

రాయచోటి టౌన్: మార్చి 9వ తేదీ నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మార్చి16వ తేదీకి వాయిదా వేసినట్లు న్యాయశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం వాయిదా వేసినట్లు కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా కడప సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్‌లు తెలియచేశారు. 9 వతేదీ రెండవ శనివారం రావడం, మహాశివరాత్రి పండుగ ఉండటం, ప్రభుత్వ సెలవులు కూడా ఎక్కువగా రావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

రాయచోటి టౌన్: పీఎం విశ్వకర్మ పథకంపై ఆయా కులవృత్తుల వారికి అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రేపన శివప్రసాద్ తెలిపారు. మంగళవారం (27వ తేదీ) ఉదయం రాయచోటి మండలపరిషత్ కార్యాలయంలో డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ కార్యాలయం వారి (విశాఖపట్టణం) ఎంఎస్‌ఎంఈ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని కుల వృత్తుల వారికి నైపుణ్యం కల్పించుందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీటిలో కుమ్మరి, కమ్మరి, జాలరి వంటి 17 రకాల కులవృత్తులకు చెందిన పరికరాల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల బందోబస్తుకు పేర్లు నమోదు చేసుకోవాలి

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో త్వరలో జరిగే 2024 సాధారణ ఎన్నికల్లో బందోబస్తు నిమిత్తం ఆసక్తి గల మాజీ సైనికులు కడప జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఐజే రఘురామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈమేరకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్, జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశించారన్నారు. వారి ఆదేశాల మేరకు ఆసక్తి గల 50 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మాజీ సైనికులు వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

29న మెగా జాబ్‌మేళా

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బి.కొత్తకోటలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగే మెగా జాబ్‌మేళాలో బహుళ జాతీయ 15 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కంపెనీలు నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలను కల్పిస్తాయన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 7799587687, 8897776368, 9741432931 నంబర్లలో సంప్రదించాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://skilluniverse. apssdc.inలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ శశికళ, ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణలు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి



వినతులను స్వీకరిస్తూ సమస్యలపై ఆరాతీస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: స్పందన ఫిర్యాదులపట్ల సత్వరం స్పందించాలని జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. స్పందన ద్వారా 40 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వీడియో కాన్ఫరెన్సు, టెలీ కాన్ఫరెన్స్‌లో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

నూతన హంగులు!

- కొత్త కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు గ్రీన్ సిగ్నల్
- ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు రూ. 100 కోట్లు మంజూరు
- సుమారు 60 ఎకరాల్లో నిర్మాణానికి స్థల సేకరణ
- మార్చి మొదటి వారంలో సీఎంతోవర్చువల్ విధానంలో శంకుస్థాపనకు సన్నాహాలు



కలెక్టర్, జేసీ బంగ్లాలకు సంబంధించి కేటాయించిన స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు

సాక్షి రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసిన అనంతరం ఎక్కడికక్కడ సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా అధికారులతోపాటు వసతులకు పెద్దపీట వేసిన ప్రభుత్వం శాశ్వత భవన నిర్మాణంతో కొత్త హంగులు అద్దేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రజల ముంగిటకు పాలనను తీసుకొచ్చిన వైఎస్ జగన్ సర్కార్ అధికారుల చర్యలతో కొత్త జిల్లాల నిర్ణయం సత్ఫలితాలిస్తోంది. కొత్త జిల్లాలు ఏర్పడిన ప్రాంతాల్లో ఒక వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అందిస్తూ ప్రతి ఒక్క వర్గానికి న్యాయం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే నూతన కలెక్టరేట్‌తోపాటు జిల్లా ఎస్పీ కార్యాలయాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్ భవనం వెనుకాల కలెక్టర్, జేసీ బంగ్లాలకు సంబంధించి మూడు ఎకరాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రాయచోటిలోని రింగ్‌రోడ్డు ఆనుకుని వేంపల్లె రహదారి సమీపంలో నూతన కలెక్టరేట్ నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో నూతన కలెక్టరేట్‌తోపాటు ఎస్పీ, జేసీ, ఇతర అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేసేలా ఇంటిగ్రేటెడ్ కలెక్టర్‌కు ప్రణాళికలు రూపొందించారు. అందుకు సంబంధించి గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన పీఎస్ గిరీషాతోపాటు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు స్థలాన్ని కూడా పరిశీలించి ఎంపిక చేశారు.

నూతన కలెక్టరేట్‌కు రూ. 100 కోట్ల నిధులు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే పరిసర ప్రాంతాలను చదును చేసి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంది. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణాలకు సుమారు రూ. 100 కోట్ల నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. అంతేకాకుండా జీఓ కూడా విడుదల చేసి తొలి విడతగా వేగంగా పనులు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో నూతన కలెక్టరేట్‌కు శంకుస్థాపన చేయించి పనులు ప్రారంభించాలని కసరత్తు జరుగుతోంది.

కలెక్టర్, జేసీ బంగళా పనులు వేగవంతం

రాయచోటిలో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ భవనాల వెనుకవైపున సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ బంగళాల పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల కిందట భూమి పూజ అనంతరం పనులు ప్రారంభించారు. పరిసర ప్రాంతమంతా చుట్టూ చదును చేయడంతోపాటు ప్రత్యేకంగా ప్రహరీ నిర్మాణం, ఇతర కాంక్రీట్ పనులు వేగం పుంజుకున్నాయి. అతి తక్కువ కాలంలోనే కోట్లాది రూపాయల వ్యయంతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

నూతన కలెక్టరేట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం



రాయచోటిలో నూతన కలెక్టరేట్ నిర్మాణంతో కొత్త కళ రానుంది. అన్ని కార్యాలయాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే స్థల ఎంపిక ప్రక్రియ పూర్తి కావడంతోపాటు నిధులు కూడా మంజూరయ్యాయి. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో పనులకు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నాం. నూతన కలెక్టరేట్ పనులు ప్రారంభం కాగానే త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. – ఎం.అభిషిక్త్ కిశోర్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

రాష్ట్రానికే తలమానికంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం



రాయచోటిలో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ రాష్ట్రానికే తలమానికంగా ఉండేలా నిర్మితం కానుంది. ఆ మేరకు ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇప్పటికే నిర్మాణ పనులకు అవసరమైన రూ. 100కోట్లను విడుదల చేస్తూ జీఓ జారీ చేసింది. టెండరు ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చింది. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహింపజేసి నిర్మాణ పనులు చేపడతాం. – గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: ప్రత్యేక శ్రద్ధతో ప్రజల అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని జేసీ సూచించారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.

పొదుపుతో ఆర్థిక సాధికారత

ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకొని ఆర్థిక లాభాలను పొంది తద్వారా ఆర్థిక సాధికారతను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ వారి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2024 ప్రచార పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 2024 ఫిబ్రవరి 26వ తేదీ నుంచి మార్చి ఒకటో తేది వరకు జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలను జరపనున్నట్లు చెప్పారు. ప్రతి బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యత గురించి బ్యాంకుకు వచ్చే ప్రజలకు, లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, జిల్లా లీడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వర‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటికొరత రానివ్వరాదు

జిల్లా పరిధిలో వేసవికాలంలో నీటికొరత లేకుండా చూసుకోవాలని, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో నీటి లభ్యతపై సోషల్ ఆడిట్ నివేదికను సమర్పించాలన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ తేదీన చేపట్టబోయే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామీణ పట్టణ ప్రాంతంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డీఐఓ డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1602 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,93,946 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మార్చి మూడో తేదీ పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు మార్చి 4,5వ తేదీల్లో అంగన్ వాడీ, ఆశా సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. అనంతరం పల్స్ పోలియో పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డివి రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బీఈడీ, ఎంఈడీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ విద్యార్థులకు సోమవారం నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 13 కళాశాలల్లో బీఈడీ, ఎంఈడీ మూడో సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ), మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు మొదలయ్యాయి. రెగ్యులర్ పరీక్షలకు ఉదయం 2551 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 346 మంది హాజరయ్యారు.

రవాణా వ్యవస్థలో మేటిగా వైఎస్ఆర్ జిల్లా

- కలెక్టర్ విజయరామరాజు
- కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వర్చువల్ విధానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రధాని నరేంద్రమోదీ



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రైల్వేస్టేషన్‌తోపాటు జిల్లాలో రహదారి, విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయని, రవాణా వ్యవస్థలో వైఎస్ఆర్ జిల్లా మేటిగా నిలువనుందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలోని 15 స్టేషన్లతో పాటు 24 రోడ్ అండర్ బ్రిడ్జిలకు, రూ. 20.35 కోట్ల కేంద్ర నిధులతో కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులకు ప్రధానమంత్రి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక రైల్వే శుభం హాలు నుంచి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక దృక్పథం నుంచి ప్రేరణ పొంది, ప్రయాణికుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్లను ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేసి మార్పును తీసుకొచ్చేలా కేంద్ర రైల్వేశాఖ భారీ పరివర్తనకు నాంది పలికిందన్నారు. 'అమృత్ భారత్ స్టేషన్'పథకం కింద రైల్వే స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలను కల్పించడానికి ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు రూ.3.141 కోట్ల మొత్తం వ్యయంతో 72 స్టేషన్ల పునరాభివృద్ధికి 'అమృత్ స్టేషన్'లుగా గుర్తించినట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న రైల్వే కూడలిగా ప్రాధాన్యతను సంతరించుకున్న కడప స్టేషన్‌ను దాదాపు రూ.20.35 కోట్ల వ్యయంతో 'అమృత్ భారత్ స్కీమ్'కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఈ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారంతో పాటు ప్రయాణ ప్రాంగణంలో అధునాతన ట్రాఫిక్ నియంత్రణ సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలకు కడప రైల్వేస్టేషన్‌తోపాటు కడప విమానాశ్రయం కూడా అధునాతన సౌకర్యాలను, విశిష్టమైన ఎయిర్‌లైన్స్ సేవలను అందించనుందని కలెక్టర్ పేర్కొన్నారు. కడప విమానాశ్రయం అభివృద్ధిలో భా గంగా రూ. 215 కోట్లతో కొత్త టర్మినల్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు, నెల రోజుల్లో అభివద్ధి పనులకు శిలాఫలకం వేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా కడప-బెంగుళూ రు, కడప-తిరుపతి రహదారి, కడప-నెల్లూరు ప్ర ధాన రహదారులను విస్తృతం చేయనున్నట్లు చెప్పారు. అంతకు ముందు లైవ్ ద్వారా దేశ ప్రధాని ప్రసంగిస్తూ వేగవంతమైన రైల్వే సేవలను అందించే క్రమంలో రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. కడప ఆర్డీవో మధుసూదన్, సీనియర్ డివిజన్ ఇంజనీర్ అక్కిరెడ్డి, ఏడీ రాధాకృష్ణ, ఏడీ ఎస్‌టీఈ కాత్యాయకుమార్, చీఫ్ టీఐ ఉమర్ బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్ రెడ్డి, నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అమృత్‌భారత్‌లో రాజంపేటకు చోటు



మాట్లాడుతున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట: రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషితో రాజంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధికి అమృత్‌భారత్ పథకం ద్వారా బీజం పడిందని, ఈ పనులను దేశ ప్రధాని మోదీ వర్చువల్ విధానంతో ప్రారంభించడం హర్షణీయమని గుంతకల్ రైల్వే డివిజనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజంపేట రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకం పనుల ప్రారంభోత్సవ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ రూ.5కోట్ల వ్యయంతో రాజంపేట రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయన్నారు. అలాగే మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.8 కోట్లు అమృత్‌భారత్ పథకంలో కేటాయింపులు జరిగాయన్నారు. రాజంపేట ఆర్డీవో మోహనరావు, బీజేపీ నేతలు రమేష్‌నాయుడు, సాయిలోకేష్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు శుభవార్త

- ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- హాల్‌టికెట్ చూపించి బస్సులో పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు
- ప్రభుత్వం నిర్ణయంపై హర్షాతిరేకాలు
- మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు



పల్లెవెలుగు సర్వీసు

జిల్లా	స్కూళ్లు	పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు	కేంద్రాలు
అన్నమయ్య	504	25316	129
వైఎస్సార్‌కడప	289	27858	289

రాజంపేట: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అవకాశాన్ని ప్రభుత్వం ఈ ఏడాది కూడా కల్పించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కార్పొరేట్ విద్యను తలదన్నేలా ప్రభుత్వం నాడు–నేడుతో స్కూళ్ల ఆధునికీకరణ, ఇంగ్లీషుబోధన, డ్రస్‌కోడ్, విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజనం, కంటివెలుగు తదితర కార్యక్రమాలతో విద్యార్థుల ఉన్నతికి ఉన్నతంగానే అడుగులు వేసింది. ఈక్రమంలో టెన్త్ పరీక్ష విద్యార్థులు హాల్‌టికెట్‌తో బస్సులో సురక్షితంగా పరీక్షా కేంద్రానికి చేరుకోవచ్చని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకున్నారు.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 681 పల్లె వెలుగు సర్వీసులు నడుస్తున్నాయి. వైఎస్సార్ జిల్లాలో కడప, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరులో డిపోలు ఉన్నాయి. అలాగే అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె-1, మదనపల్లె-2, పీలేరు డిపోలున్నాయి. వీటి పరిధిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు తిరుగుతున్నాయి. అన్నమయ్య జిల్లా వరకు 348, వైఎస్సార్ కడప జిల్లాలో 333 పల్లె వెలుగు బస్సులు టెన్త్ పరీక్ష రాసే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఇప్పటికే విద్యార్థుల చేతుల్లో బస్‌పాసులున్నాయి. అన్నమయ్య జిల్లా వరకు అన్ని రకాల పాసులు కలుపుకొని 41523 మందికి ఉన్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లాలో 27,725 మందికి పాసులు ఉండగా, మరికొన్ని వివిధ రకాల కింద కేటాయించినవి ఉన్నాయి.
- పదోతరగతి పరీక్షలు అన్నమయ్య జిల్లాలో 504 స్కూళ్లకు 25316 మంది పది పరీక్షలు రాయనున్నారు. రాజంపేట, మదనపల్లె, పీలేరు, రాజంపేట, తంబళ్లపల్లె,రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే పరీక్షకేంద్రాలను అన్ని సదుపాయాలతో సిద్ధం చేశారు. ఏ,బీ,సీ కేటగిరీ వారీగా ఏ కేటగిరీ కింద 58.. బీ కేటగిరీ కింద 56, సీ కేటగిరి కింద 15 సెంటర్లను ఏర్పాటుచేశారు. వివిధ పల్లెల నుంచి వచ్చే పదోతరగతి విద్యార్థులు హాల్‌టికెట్స్ చూపించి తమ ప్రాంత పరిధిలో నడిచే పల్లె వెలుగు సర్వీసుల ద్వారా ఆయా సెంటర్లకు చేరుకోనున్నారు.
- వైఎస్సార్ జిల్లాలో 289 స్కూళ్లకు 27858 మంది టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు. కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, బద్వేలు నియోజకవర్గాల పరిధిలో 153 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. వివిధ పల్లె ప్రాంతాల నుంచి విద్యార్థులు చేరాల్సిన సెంటర్లకు పల్లె వెలుగు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో ఉచితంగా వెళ్లేందుకు బస్సులో హాల్‌టికెట్ చూపిస్తే చాలని ఆర్టీసీ అధికారులు చెపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం పట్ల టెన్త్ రాసే పేద, మధ్యతరగతి విద్యార్థులు, వారి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాన్ని టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కండక్టర్‌కు హాల్‌టికెట్ చూపిస్తే చాలు పరీక్ష కేంద్రానికి ఉచితంగా వెళ్లవచ్చు.వైఎస్సార్ జిల్లాలో 333 పల్లెవెలుగుసర్వీసులు ఉన్నాయి. వచ్చేనెల 18 నుంచి 30 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. – గోపాల్‌రెడ్డి, డీపీటీఓ, కడప

అందుబాటులో పల్లెవెలుగు బస్సులు



పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగు బస్సులు ఉదయం నుంచి రాత్రి వరకు నడుస్తూనే ఉన్నాయి. ఇవన్నీ కూడా టెన్త్ రాసే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. పల్లెల నుంచి పట్టణాలు, మండల కేంద్రాల్లో ఉన్న సెంటర్లకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశాం.జిల్లా పరిధిలో 348 పల్లె వెలుగుసర్వీసులు ఉన్నాయి. పరీక్షకు వెళ్లే విద్యార్థులు బస్‌లో హాల్‌టికెట్ చూపిస్తే చాలు మీ సెంటర్‌కు ఉచితంగా వెళ్లవచ్చు. -రాము, డీపీటీఓ, రాయచోటి

జగన్ మామయ్యకు కృతజ్ఞతలు



మాకు చదువు విషయంలో జగన్‌మామ చేసిన మేలు ఎన్నటికీ మరువలేం. బడిలో ఆధునాతకమైన సౌకర్యాలు, యూనిఫాం, పుస్తకాలు, ఇంగ్లీషు బోధనతో పాటు మా లాంటి పేదల విద్యాభివృద్ధికి సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు.. ఇప్పుడు టెన్త్ పరీక్ష రాయడానికి సెంటర్‌కు బస్సులో ఉచితంగా వెళ్లేందుకు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది.జగన్ మామయ్యకు కృతజ్ఞతలు. -బి.చైతన్య, టెన్త్ విద్యార్థిని, వెలుగుపల్లె, సిద్ధవటం

రెప్పపాటులో ప్రమాదం..

అంతులేని విషాదం

- క్షణాల వ్యవధిలో గాల్లో కలిసిన ఐదు ప్రాణాలు
- కేసుల్లో పట్టుబడితే అమెరికా వెళ్లలేమన్న ఆత్రుతే ప్రమాదానికి కారణం
- డాబాలో బయలుదేరినప్పటి నుంచి దూకుడుగానే డ్రైవింగ్
- జిల్లా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం, బంధువులకు అప్పగింత
- దహన సంస్కార ఖర్చులకు రూ.10వేలు అందజేసిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్


బార్లపల్లెలో ప్రమాదం జరిగిన ప్రాంతం


నుజ్జునుజ్జు అయిన స్కార్పియో వాహనం


ప్రమాదానికి గురైన స్కార్పియో వాహనంతో విక్రమ్ (ఫైల్)


కుమారుడి మృతిని తట్టుకోలేక రోదిస్తున్న తిలక్ తల్లి భాగ్యమ్మ, చెల్లెలు పావని

మదనపల్లె : కనురెప్పపాటులో జరిగిన ప్రమాదంలో, క్షణాల వ్యవధిలో ఐదు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. యాక్సిడెంట్ కేసుల్లో పోలీసులకు పట్టుబడితే అమెరికా వెళ్లలేమన్న ఆతృతే స్కార్పియో యజమాని విక్రమ్ వాహనాన్ని వేగంగా నడిపేలా చేసి ఇద్దరు పేద పాడిరైతులను, తనతో కలిపి మరో ఇద్దరు స్నేహితుల ప్రాణాలు కోల్పోయేలా చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం బార్లపల్లెలో ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డుప్రమాదం... మదనపల్లెను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. సోమవారం ఉదయం ఏ నోట విన్నా, నలుగురు ఒకచోట గుమికూడినా ప్రమాదవార్త గురించే చర్చించుకోవడం కనిపించింది. ప్రమాదంలో చనిపోయిన ఐదుగురు మదనపల్లె టౌన్, మండలానికి చెందిన వారు కావడంతో... మృతులపై ప్రజల్లో మరింత సానుభూతి వ్యక్తమైంది. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆస్పత్రి అట్టుడికిపోయింది. ఐదు మృతదేహాలకు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, వైద్యులు కుటుంబ సభ్యులకు అందజేశారు. మదనపల్లె వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఉదయం నుంచి ఆస్పత్రిలోనే ఉండటమే కాకుండా, జిల్లా ఆస్పత్రి వైద్యులను అప్రమత్తం చేసి త్వరగా పోస్టుమార్టం ప్రక్రియ పూర్తిచేసి, మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చొరవ చూపారు. ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు..దహన సంస్కారాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదును అందజేశారు. మృతుల వివరాలు, ప్రమాదం జరిగిన తీరుపై నివేదికను ప్రభుత్వానికి అందజేశామని, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, వైస్ ఎంపీపీ నందినితాజ్, జేసీఎస్ కన్వీనర్ బావాజీ, రాయల్ రవీంద్ర తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబ నేపథ్యం..

స్కార్పియో యజమాని సుంకర విక్రమ్(38) అవివాహితుడు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివి పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లి అక్కడ వ్యాపార రంగంలో స్థిరపడ్డాడు. ఏడాది క్రితం తండ్రి సుంకర చలపతి చనిపోయారు. తల్లి రాగలత మదనపల్లె దేవతానగర్‌లో నివాసం ఉంటోంది. చెల్లెలు ప్రియాంకకు వివాహమై భర్తతో అమెరికాలో ఉంటోంది. మార్చి 2న విక్రమ్ అమెరికా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. 8 నెలల క్రితం మదనపల్లెకు వచ్చిన విక్రమ్ నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్ వద్ద సన్‌రైజ్ టీ కెఫేను ప్రారంభించాడు. ప్రమాదంలో మృతిచెందిన తిలక్, శ్రీనాథ్, గాయపడ్డ చరణ్, హరీష్, మహేష్ ఇక్కడే పరిచయమయ్యారు. ఎనిమిది నెలలుగా వీరితో సరదాగా గడిపిన విక్రమ్ నాలుగు రోజుల్లో అమెరికా వెళ్లిపోతున్నానని, స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు కర్ణాటకలోని రాయల్పాడుకు తీసుకువెళ్లాడు.

తంబళ్లపల్లె మండలం కొటాల ఎల్లకవాళ్లకోటకు చెందిన అనుముల మల్లికార్జున, భార్య భాగ్యమ్మ 25 ఏళ్ల క్రితం జీవనోపాధిలో భాగంగా మదనపల్లెకు వలస వచ్చారు. కుమారుడు తిలక్(19), కుమార్తె పావని. తిలక్ స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విక్రమ్ టీ హోటల్‌కు తరచూ వెళ్లి వస్తుండటంతో అతడితో పరిచయం ఏర్పడింది. ప్రమాదం జరిగిన ఆదివారం తిలక్ కుటుంబ సభ్యులకు సంబంధించి కనుమలో గంగమ్మగుడిలో కార్యక్రమం జరిగింది. తల్లి భాగ్యమ్మ గుడికి రావాలని ఎంత ప్రాధేయపడినా, లెక్కపెట్టక స్నేహితులే కావాలని విక్రమ్‌తో కలిసి వెళ్లడం అతడి చావుకు కారణమైంది. జిల్లా ఆస్పత్రిలో ఇదే విషయం చెబుతూ.. నా మాట విని ఉంటే నాకళ్ల ముందు ఉండేవాడివి కదరా..అని తల్లి రోదించడం చూపరులను కలిచివేసింది.

మదనపల్లె మున్సిపల్ వర్కర్ చిన్నరెడ్డెప్ప, పద్మమ్మ దంపతులకు కుమారుడు శ్రీనాథ్, కుమార్తె లక్ష్మి ఉన్నారు. లక్ష్మికి పెళ్లై అత్తారింటికి వెళ్లింది. శ్రీనాథ్ ఫిబ్రవరి 22న సీఆర్‌పీఎఫ్ పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. విక్రమ్ టీ హోటల్‌కు వెళ్లే క్రమంలో అతడితో పరిచయం పెంచుకున్నాడు.

మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన కరమల సుబ్రహ్మణ్యం ఆచారి(55)కు భార్య రమణమ్మ, కుమారుడు రవీంద్ర ఆచారి, కుమార్తె నిర్మల ఉన్నారు. వ్యవసాయం జీవనాధారం. ఆవును మేపుకుంటూ, వచ్చిన పాలను డిపోకు వేసుకుని జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో పాడిరైతు చంద్రప్పకు ఇద్దరు కుమారులు మోహన, సుబ్రహ్మణ్యం. రెండు ఆవులను పెట్టుకుని పాలను డిపోకు వేసి, వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండు కుటుంబాలది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి.

ఇదే అతిపెద్ద ప్రమాదం..

స్పీడ్‌బ్రేకర్ వద్ద ఎగిరిన స్కార్పియో, రోడ్డుదిగి కేవలం నిమిషం వ్యవధిలో పాలడిపో వద్ద రైతులను ఢీకొనడం, అక్కడి నుంచి సెకన్ల వ్యవధిలో లారీని ఢీకొట్టి గాల్లోకి ఎగరడం ఇప్పటికీ మరచిపోలేకపోతున్నానని బార్లపల్లెకు చెందిన ప్రత్యక్షసాక్షి గోపి తెలిపారు. తన 55 ఏళ్ల వయస్సులో బార్లపల్లెలో జరిగిన పెద్ద ప్రమాదం ఇదేనని భయపడుతూ చెప్పుకొచ్చాడు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బార్లపల్లె రోడ్డుప్రమాదంలో గాయపడిన ముగ్గురిలో.. రామారావు కాలనీకి చెందిన హరీష్‌కు తలకు తీవ్రగాయం కావడంతో తిరుపతికి రెఫర్‌చేశారు. పరిస్థితి విషమంగానే ఉంది. చరణ్ తలకు తీవ్ర గాయం కారణంగా బెంగళూరుకు తీసుకెళ్లారు. రామారావుకాలనీకి చెందిన మహేష్‌కు రెండు చేతులు విరిగిపోవడంతో జిల్లా ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అతడిని డిశ్చార్జి చేయించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.


మృతుల కుటుంబాలకు దహనసంస్కారాలకు ఆర్థికసహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

బయలుదేరినప్పటి నుంచి దూకుడే..

కర్ణాటకలోని రాయల్పాడు సమీపంలో డాబాలో స్నేహితులతో కలిసి మద్యం సేవించిన విక్రమ్... బండి వెనక్కు తీసేటప్పుడు పార్కింగ్‌లో ఉన్న ఓ కారును ఢీకొన్నాడు. దీంతో వారు గొడవపెట్టుకోవడంతో పోలీసు కేసు వద్దని, వారితో వాగ్వాదం చేసి రూ.5,000 నష్ట పరిహారం కట్టించి బయలుదేరాడు. ఈ విసుగులో వాహనాన్ని వేగంగా నడుపుతూ..చీకలబైలు చెక్‌పోస్ట్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో కారు సైడ్‌మిర్రర్‌ను ఢీకొట్టాడు. దీంతో వారు ఎక్కడ తనను వెంబడిస్తారో నన్న భయంతో.. తప్పించుకోవాలని వాహనాన్ని వేగంగా నడిపాడు. ఈ క్రమంలో బార్లపల్లె ప్రారంభంలో స్పీడ్‌బ్రేకర్‌ను గమనించక వేగంగా పోనివ్వడంతో వాహనం ఒక్కసారిగా ఎగరడంతో అదుపుచేయలేక రోడ్డు ఎడమవైపు ఎగుడుదిగుడుగా ఉన్న ప్రదేశంలోకి మళ్లింది. వాహనాన్ని తిరిగి రోడ్డుపైకి తెచ్చే క్రమంలో పాలడిపో వద్ద నిల్చుని ఉన్న ఇద్దరు పాడిరైతులను ఢీకొన్నాడు. గ్రామస్తులు కేకలు వేయడంతో వారిని సైడ్‌మిర్రర్‌లో గమనిస్తూ ఎదురుగా వస్తున్న లారీని గుర్తించక, వేగంగా లారీని ఢీకొట్టడంతో ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిశాయి. పాలడిపో వద్ద పాడిరైతులను ఢీకొన్న 150 మీటర్లలోపే బోరులారీని స్కార్పియో ఢీకొంది. ఎయిర్‌బ్యాగ్‌లు ఓపెన్ అయినప్పటికీ, టాప్ ఎగిరి డ్రైవర్ విక్రమ్ తల తెంపుకుపోవడం, రైతుల్లో సుబ్రహ్మణ్యం ఆచారికి కాలు విరిగిపోవడం, ప్రమాదస్థలంలో అవయవాలు ఛిద్రమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత


లక్ష్మీభవానీ (ఫైల్)


కృష్ణబాబు (ఫైల్)


వినిత (ఫైల్)

రామాపురం : రామాపురం మండలంలోని కర్నూలు – చిత్తూరు జాతీయరహదారిపై బండపల్లె పంచాయతీ ఐరీస్ గ్రాండ్ హోటల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుల్లో రామాపురం మండలం సరస్వతిపల్లెకి చెందిన డేగల లక్ష్మీ భవాని(32), ఆమె కుమార్తె వినిత (4), బావ కుమారుడు కృష్ణబాబు(22) ఉన్నారు.


సంఘటన స్థలంలోనే మృతి చెందిన లక్ష్మీభవానీ,కృష్ణబాబు

ప్రాణం తీసిన విద్యుత్ కంచె

బహిర్భూమికి వెళ్లి విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన పందిపాటి వెంకటసుబ్బయ్య (17) అనే యువకుడు ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. రత్నమ్మ, వెంకటసుబ్బయ్య దంపతుల కుమారుడైన వెంకటసుబ్బయ్య ఇంటర్ చదువుతూ మధ్యలో మానివేశాడు. రోజూ మాదిరే తోటి స్నేహితులతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ బహిర్భూమికి వెళ్లాడు. రోడ్డు పక్కనే మొక్కజొన్న సాగులో ఉంది. అడవి పందుల బెడద కోసం పంట సాగుచేసిన వారు పంట పొలానికి వెలుపల విద్యుత్ కంచె వేశారు. అది గమనించని వెంకటసుబ్బయ్య విద్యుత్ వైర్లు కాలికి తగలడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. తోడు వెళ్లిన మరో బాలుడి చేతికి గాయమైంది. అదే సమయంలో అదృష్టవశాత్తు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. లేదంటే మరో ఇద్దరు విద్యుత్ షాక్‌కు బలయ్యేవారు. వెంకటసుబ్బయ్య మృతిచెందిన విషయాన్ని తోటి స్నేహితులు వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటి వరకు బాగా ఉన్న వెంకటసుబ్బయ్య ఒక్కసారిగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహం వద్ద రోదించారు. వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారమివ్వడంతో అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని తండ్రి చిన్న వయస్సులోనే చనిపోయాడు. తల్లే ఆలనాపాలన చూసుకునేది. కాగా పంట పొలాల చుట్టూ వేసిన విద్యుత్ కంచెల వలన ఇప్పటికే పలువురు మృత్యువాతపడగా మరికొందరు వికలాంగులుగా మారారు. మండలంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. వెంకటసుబ్బయ్య మృతికి కూడా విద్యుత్ కంచె కారణం కావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫర్హానా

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. పెద్దమండ్యం- చిన్నమండ్యం రహదారిపై సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిన్నమండెం మండలం కస్బాకు చెందిన ముబారక్, అతని భార్య ఫర్హానా (40) ద్విచక్రవాహనంలో మండలంలోని కలిచెర్లకు బంధువుల ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని నగిరి బస్టాప్ సమీపంలో ఎదురుగా దోసకాయల లోడుతో వస్తున్న ఐషర్ వాహనం పక్కకు తొలిగే సమయంలో ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనంలో వెళుతున్న ముబారక్, భార్య ఫర్హానా కింద పడిపోగా, దోసకాయల లోడుతో వెళుతున్న ఐషర్ వాహనం వెనుక చక్రాలు తగలడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ముబారక్‌ను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మహిళ మృతి వార్త తెలియడంతో చుట్టూ గ్రామాల ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రం

రామాపురం : మార్చి 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి పార్టు 2 సెట్ ప్రశ్నపత్రాలను సోమవారం మండల పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఆర్‌ఓ రఘురామయ్య, చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్ అఫ్రోజ్‌బేగం తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో 428 మంది విద్యార్థులు పరీక్షలను రాస్తున్నారని తెలిపారు. ఈ కేంద్రంలో ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, లక్కిరెడ్డిపల్లె జూనియర్ కాలేజ్ విద్యార్థులు మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి

రాయచోటి : ఎన్నికల విధులలో ప్రతి పోలీసు బాధ్యతగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సుధాకర్ సూచించారు. అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ సభా భవనంలో జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన ప్రత్యేక చట్టాల గురించి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో పోలీస్ సిబ్బంది నిర్వహించాల్సిన విధుల గురించి డీఎస్పీ వివరించారు. పోలింగ్ జరిగే ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీయాలన్నారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

ఓబులవారిపల్లె : మండలంలోని మంగళంపల్లి గ్రామంలో నాగతోటి నరసింహులు(38) మృతదేహాన్ని సోమవారం వెలికితీసి శవపరీక్షలు నిర్వహించారు. మృతుడు నరసింహులు గతనెల 28వ తేదీన వెంకటగిరి-కాళహస్తి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఫిబ్రవరి 8వ తేదీన తిరుపతి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని స్వగ్రామం మంగళంపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు వెంకటగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ శేషగిరి రావు, రాజంపేట ఆర్‌ఓ మోహన్ రెడ్డిల సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి శవపరీక్షలు నిర్వహించారు.

మెరుగైన బోధనకు స్విఫ్ట్ చాట్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి

సంబేపల్లె : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ప్లాట్‌ఫాంపై నడిచే స్విఫ్ట్ చాట్ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో స్విఫ్ట్‌చాట్ యాప్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్విఫ్ట్‌చాట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా బోధనా నైపుణ్యాలను పెంచుకోవడంతోపాటు పాఠ్యాంశ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. స్మార్ట్ ఫోన్ ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు స్విఫ్ట్‌చాట్ యాప్ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.